ముమ్మరంగా వరి కోతలు

● కల్లాల్లోకి చేరుతున్న ధాన్యం


కల్లాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం

మల్హర్: వానాకాల సీజన్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. హార్వెస్టర్ల సాయంతో రైతులు వరికోతలు కోస్తున్నారు. వెంటనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఈసారి సన్నరకాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ కూడా ప్రకటించింది. అంతే కాకుండా గతంలో చోటుచేసుకున్న లోటుపాట్లు ఈసారి ఎదురవకుండా పకడ్బందీగా ధాన్యం కొనుగోలు చేసేలా వ్యవసాయాధికారులు పక్కా కార్యాచరణ రూపొందించారు.

18 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

మండలంలో 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 16 పీఏసీఎస్, రెండు డీసీఎంఎస్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. వీటి ద్వారా సుమారు 12వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. 17 తేమ శాతం వస్తే అధికారులు వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా, మండల అధికారుల పర్యవేక్షిస్తూ ధాన్యం కొనుగోలు చేయస్తుడంతో పాటు వెంటనే మిల్లులకు తరలించే విధంగా వాహనాలను సమకూరుస్తున్నారు.

అన్నదాతలపై భారం..

పెరిగిన పెట్రో, డీజిల్ ధరలు వరి కోతలపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. తడారని పొలంలో చైన్, ఫోర్ప్లేలర్ యంత్రాలతో వరి కోతలు చేయాల్సి రావడంతో సాధారణ యంత్రాల కంటే అధికంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. గంటకు సాధారణ యంత్రాలకు రూ.1,800కు పైగా ఉండగా, ఫోర్ప్లేలర్, చైన్ హార్వెస్టర్లకు రూ.2,500పైగానే ఉంది. అంతేకాకుండా కల్లాలు, ఇళ్ల నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించేందుకు ఒక్కో ట్రిప్పు ట్రాక్టర్‌కు కనీసం రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారు.

పరీక్షలతో పోటీతత్వం పెరుగుతుంది


కాటారం: విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ


రేగొండ: మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

● ఎంఈఓ శ్రీదేవి

కాటారం: ప్రతిభా పరీక్షలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందుతుందని మండల విద్యాధికారి శ్రీదేవి, టీఎంఎఫ్ మండల అధ్యక్షుడు గంట రాజబాబు అన్నారు. తెలంగాణ మ్యాథమాటిక్స్ ఫోరం (టీఎమ్ఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి, వేగం, ఖచ్చితత్వం పెంచడానికి పోటీ పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. పదవ తరగతి విద్యార్థులు గణితంలోని అన్ని పాఠ్యాంశాలలో పూర్తి అవగాహన పెంచుకొని భవిష్యత్‌లో నిర్వహించే అన్ని ప్రవేశ పరీక్షలల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. జెడ్పీహెచ్ఎస్ విభాగం నుంచి కాటారం పాఠశాలకు చెందిన సునీల్ ప్రథమ స్థానం, ధన్వాడ పాఠశాలకు చెందిన రోహిత్ ద్వితియ స్థానం, చింతకానికి చెందిన విష్ణు తృతియ స్థానం, గురుకుల విభాగంలో కాటారం బాలుర పాఠశాలకు చెందిన మనిదీప్ ప్రథమ స్థానం, మహేందర్ తృతియ స్థానం, కాటారం బాలికల పాఠశాలకు చెందిన మేఘన ద్వితియ స్థానంలో విజేతలుగా నిలవగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమమంలో టీఎంఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఇన్‌చార్జ్ హెచ్ఎం సమ్మయ్య, గణిత ఉపాధ్యాయులు పవన్‌కుమార్, రవీందర్, కవిత, చంద్రశేఖర్, ప్రసన్నలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ (కొత్తపల్లిగోరి): గణితంలో విద్యార్థులు మెళకువలు నేర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కొత్తపల్లిగోరి మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రలలోని ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలను నిర్వహించారు. ప్రథమ స్థానం ప్రమోద్, చిన్నకోడేపాక, ద్వితీయ, తృతీయ స్థానాలు ఓంప్రకాశ్, ఎండీ హైమత్, జగ్గయ్యపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రశేఖర్ విజేతలను అభినందిస్తూ, గణితశాస్త్రం ప్రాముఖ్యత, నిత్య జీవితంలో, ఉద్యోగ సాధనలో దాని స్థానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లిగోరి ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత, గణిత ఉపాధ్యాయులు విద్యాసాగర్, కృష్ణమూర్తి, శిరీష, షరీఫ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



మల్హర్: మండల కేంద్రం తాడిచర్లలోని హనుమాన్ సహిత శివ పంచాయతనాలయంలో కార్తీక మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, నమక చమకాలతో శివుడికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

సమర్థవంతంగా పశుగణన

భూపాలపల్లి రూరల్: పశుగణనను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి అధికారులకు సూచించారు. భూపాలపల్లి పట్టణంలో జరుగుతున్న పశుగణను శుక్రవారం జిల్లా పశుగణన నోడల్ అధికారి డాక్టర్ వెంకన్నతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవులు, గేదెలు, కోళ్లు, పందులు, బాతులు, పెంపుడు కుక్కలు అన్నిటి వివరాలు సేకరించాలని ఆదేశించారు.

నియామకం



చిట్యాల: చిట్యాల, టేకుమట్ల ఉమ్మడి మండలాల లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా దానవేణి రమేశ్, యూనియన్ ప్రెసిడెంట్ దుద్దెటి రమేశ్, వైస్ ప్రెసిడెంట్‌గా అంబాల రాజు, ప్రధాన కార్యదర్శిగా భూపతి సంపత్‌కుమార్, కార్యదర్శిగా పుట్టకోక్కుల రాకేశ్, కోశాధికారిగా నిమ్మల రాజగోపాల్ తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

ములుగు రూరల్: రాష్ట్రంలో గురుకుల పాఠశాల విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురవుతున్న విషయంపై బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు హాజరు కాకుండా బీజేవైఎం, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ములుగు పోలీస్‌లు బీజేవైఎం నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత ఆహారం తిని విద్యార్థులు మృతి చెందినా... ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థుల మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వివాహిత అదృశ్యం

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైందని ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మాళ్లపల్లికి చెందిన రాతిపల్లి రమ్య ఈ నెల 27న భర్త శ్రీకాంత్ ఇంట్లో లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. 28న ఉదయం ఇంటికి వచ్చిన శ్రీకాంత్ తన భార్య గూర్చి ఇంటి వద్ద, తెలిసిన వారి వద్ద ఆరా తీసినప్పటికి ఆచూకి తెలియలేదు. దీంతో శ్రీకాంత్ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

వెంకటాపురం(కె): వేడినీటిలో పడి తీవ్ర గాయాల పాలైన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని శాంతి నగర్‌కు చెందిన బాలుడు దేవిప్రసాద్(2) ఈనెల 27న వేడినీటిలో పడి గాయాలు కావడంతో ఎంజీఎంలో చికిత్స నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

రేగొండ: పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అమలు చేసి తీరుతామని తెలిపారు. పదేళ్ల పరిపాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18 కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. తాము ప్రజాసేవకులమని, నియోజకవర్గ కష్టాలు తీర్చేందుకు రోజుకు 18 గంటలు పని చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్ గ్రామాలలో ఇటీవల నిర్మించిన సైడ్ కాల్వలను ప్రారంభించారు. అలాగే జగ్గయ్యపేటలో అంగన్‌వాడీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. రేగొండ మండలంలోని జూబ్లీనగర్, తిరుమలగిరి, దమ్మన్నపేట, రాయపల్లి, కనిపర్తి, నాగుర్లపల్లి, లింగాల, పోచంపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దమ్మన్నపేటలో కల్వర్టు పనులు, రేపాకలో మహిళా సమైఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పీఆర్ డీఈ రవికుమార్, జిల్లా, మండల నాయకులు ఉమేష్‌గౌడ్, పున్నం రవి, ఓంప్రకాశ్, భిక్షపతి, శ్రీధర్‌గౌడ్, రాజేశ్వరరావు, నడిపెల్లి సంజీవరావు, కిషన్‌రావు, దేవేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కలిసిమెలిసి జీవించాలి

● తహసీల్దార్ హేమ


మాట్లాడుతున్న తహసీల్దార్ హేమ

చిట్యాల: సమాజంలో ప్రజలందరు సమానత్వంతో కలిసిమెలిసి జీవించాలని తహసీల్దార్ హేమ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అన్యాయాలపై అవగాహన కల్పించారు. ఎస్సై శ్రావన్‌కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం


నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి ప్రధాన కూడలి వద్ద శుక్రవారం గుడుంబాను స్వాధీనం చేసుకోని నిందితుడిపై కేసు నమోదు చేసినట్ల ఎస్సై గోగికారిప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలంలోని అందుకుతండా గ్రామానికి చెందిన ఆజ్మీర సమ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 20లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా గర్మిళ్లపల్లిలో పట్టుకున్నట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు తరలిచి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసి అబ్కారి శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఏఎస్సై దాట్ల కుమారస్వామి, కానిస్టేబుల్ వెంకటేష్, తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న చంద్రశేఖర్

కాటారం: కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఆయన పీఏ ఆకుల చంద్రశేఖర్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. కాటారం మండలానికి చెందిన 10 సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మహదేవపూర్ మండలానికి 2 సీఎంఆర్ఎఫ్, 21 కల్యాణలక్ష్మి, మహాముత్తారం మండలానికి 9 సీఎంఆర్ఎఫ్, 51 కల్యాణలక్ష్మి, మల్హర్ మండలానికి 17 సీఎంఆర్ఎఫ్ చెక్కులు వచ్చినట్లు చంద్రశేఖర్ తెలిపారు. మంథని నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి పథకానికి మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా దరఖాస్తు చేసుకోగా మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా


కళాప్రదర్శన ఇస్తున్న కళాకారులు

కాటారం: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మండలంలోని పలు గ్రామాల్లో కళాజాతా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలితో పాటు కొత్తపల్లి, చింతకాని గ్రామాల్లో కళాకారులు కళాప్రదర్శన ఇచ్చారు. ప్రభుత్వం అందజేస్తున్న సన్నవడ్లకు బోనస్, రూ.500లకే గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ పథకం, రూ.రెండు లక్షల రుణమాఫీ తదితర ప్రభుత్వ పథకాలను పాటల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతిక సారథి కళాకారులు ఓనపాకల కుమార్, కమ్మల ప్రవీణ్‌కుమార్, ఆత్మకూరి మహేందర్, చీకట్ల శంకర్, మధుబాబు, సెగ్గెం శిరీష, జాడి సుమలత, పులి రాధిక, కాస స్వాతి, గడ్డం నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనంపై కొనసాగుతున్న దర్యాప్తు

● దుండగులు మంచిర్యాలకు చెందిన వారుగా అనుమానం?

కాటారం: కాటారం మండలం శంకరాంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుడగజంగాల కాలనీలో గురువారం జరిగిన దొంగతనంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని రాత్రి సమయంలో దొంగలు చోరీకి పాల్పడి 18 తులాల బంగారం, 50 తులాల వెండి, టీవీ ఎత్తుకెళ్లిన విషయం విధితమే. క్లూస్‌టీం సంఘటన స్థలంలో ఆనవాళ్లు సేకరించగా డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. శుక్రవారం పోలీసులు మరోమారు సంఘటనా స్థలం చేరుకొని మరిన్ని వివరాలు సేకరించడంతో పాటు దొంగలు ఎటువైపు నుంచి వచ్చారు, ఎలా వచ్చారు, ఎంత మంది వచ్చి ఉంటారు.. అనే కోణంలో వివరాలు సేకరించినట్లు తెలిసింది. అంతేకాకుండా దొంగతనం జరిగిన ఇళ్లు కాటారం–మంథని ప్రధాన రహదారిని ఆనుకొని ఉండటంతో సమీపంలో ఉన్న పలు సీసీ కెమెరాలు, గంగారం ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలించగా దుండగులకు సంబంధించిన కొంత మేర సమాచారం లభించినట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసులకు లభించిన ప్రాథమిక సమాచారంతో డీఎస్పీ, సీఐ ఆధ్వర్యంలో లోతుగా దర్యాప్తు సాగిస్తున్నట్లు తెలిసింది. మంచిర్యాల జిల్లాకు చెందిన కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు అక్కడికి వెళ్లినట్లు సమాచారం.

గ్రామీణ సేవలపై అధికారుల బృందం ఆరా


గ్రామస్తులతో మాట్లాడుతున్న సెక్షన్ అధికారుల బృందం

కాటారం: గ్రామ పంచాయతీ స్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవలపై కేంద్ర సచివాలయ సెక్షన్ అధికారుల బృందం సభ్యులు ఆరా తీశారు. శిక్షణలో భాగంగా బృంద సభ్యులు శుక్రవారం కాటారం మండలం గంగారం గ్రామ పంచాయతీలో పర్యటించారు. గ్రామ పంచాయతీ ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలు, మందుల వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలతో ముఖాముకి నిర్వహించి పొదుపు, రుణసదుపాయాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలపై వివరాలు సేకరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు, పౌష్టికాహారం పంపిణీ తదితర అంశాలను తెలుసుకున్నారు. గ్రామీణ చేతి వృత్తుల ద్వారా పొందుతున్న ఉపాధి అవకాశాలను గూర్చి చేతివృత్తుల వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అడ్డూరి బాబు, ఎపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు బీరెల్లి కరుణాకర్, షగీర్ ఖాన్, సాంకేతిక సహాయకులు రవి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


పలిమెల: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు


కాటారం: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

● ఎంపీడీఓ శ్రీనివాస్

పలిమెల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వంట గదిలోకి వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. అలాగే రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. భోజనంలో నాణ్యత పాటించాలని లేకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత, విద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల మధ్యాహ్న భోజనం, వంట సామగ్రి, స్టోర్‌రూంను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసకున్నారు. ఈ కార్యాక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మల్హర్: భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్

కాటారం: విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని మహాముత్తారం తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. మహాముత్తారం మండలం పెగడపల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ పరిశీలించారు. పాఠశాలలో పరిసరాల, తరగతిగదుల పరిశుభ్రత, సౌకర్యాలపై ఆరా తీశారు. వంట గదిని తనిఖీ చేసి వంట సామగ్రి, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.


కాటారం: విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

కాటారం: హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ అడ్డూరి బాబు, ఎంపీఓ వీరస్వామి సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ బాలికల వసతి గృహంను శుక్రవారం రాత్రి ఎంపీడీఓ, ఎంపీఓ తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంటగది, వంట సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఎప్పటికప్పుడు తయారు చేసిన ఆహారపదార్థాలు అందించాలని వార్డెన్ భవానికి సూచించారు. అనంతరం అధికారులు విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


టేకుమట్ల: పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర


భూపాలపల్లి రూరల్: పరామర్శిస్తున్న నాయకులు


మల్హర్: నివాళులర్పిస్తున్న పుట్ట మధు

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మాదారపు శ్రీనివాస్, మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన పచ్చిక దేవిక ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ సర్పంచ్ పోలాల సరోత్తంరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆది రఘు, కొలిపాక రాజయ్య, మారం లింగారెడ్డి, లాడి రవి, పెర్కారి నర్సింగరావు, పొనగంటి బాబు, అఫ్జల్, అక్రం, తదితరులు ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: తాడిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలైన నేడుపల్లి గ్రామానికి చెందిన బత్తిని శ్రీనివాస్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, బాధితుడిని శుక్రవారం తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ పరామర్శించారు. తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండపాక సాంబయ్య, నాయకులు తడక సుధాకర్, గడ్డం సదానందం, మామిండ్ల శ్రీనివాస్, పెరుమాండ్ల తిరుపతి, అశోక్, ముత్యాల రాజబాబు, తాళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లిలో పంతకాని వెంకట్ రాజు తల్లి వెంకటమ్మ, పెద్దతుండ్ల గ్రామానికి చెందిన సింగిల్ విండో మాజీ డైరక్టర్ జక్కుల లక్ష్మణ్ తల్లి బక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను శుక్రవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గోనె శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీశ్, నాయకులు వాల యాదగిరి రావు, నాగేశ్వర్ రావు, బండారి సమ్మయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అక్కినవేని సుమన్, అన్నమనేని మధుసూదన్‌రావు, నారా రమేశ్, సురేశ్, సమ్మయ్య, సుధాకర్, రాజాబాపు, శ్రీనివాస్, రవి, రాజేందర్ పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొయ్యల రాజయ్య ఇటీవల అనారోగ్యానికి గురికాగా శుక్రవారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, వైద్య చికిత్సపై ఆరా తీశారు. నాయకులు గడ్డం కొంరయ్య, కొండ రాయమల్లు, మంత్రి లక్ష్మణ్, ఆత్మకూరి కుమార్, మారుపాక రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



చిట్యాల: మండలంలోని నైన్‌పాక, చైన్‌పాక, వరికోల్‌పల్లి గ్రామాలకు చెందిన రైతుల కరెంట్ కష్టాలు చూసి చొరవ తీసుకుని 33/కేవీ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసినందుకు గాను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చిత్రపటానికి రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, నాయకులు కట్టికోళ్ల రాజు, నాగుల సాంబయ్య, మెండు రవీందర్, ఈర్ల మల్లక్క, కస్పాద సమ్మయ్య, తిరుపతి, చిలుముల రమణాచారి, జంబుల తిరుపతి, నోముల నాగరాజు, నరేష్, సాదరాజు తదితరులు పాల్గొన్నారు.